
రూ.1,725/- మైనెటిక్ మిక్సీ బహుమతికి అర్హమైన కథ!





## "ప్రేమంటే నమ్మకమనే పునాదుల్తో నిర్మించుకున్న ఓ అందమైన భవనం"

ముత్యాల్లాంటి అక్షరా ల్తో మానస వ్రాసిన నా డైరీ లోని మొదటి వాక్యం అది. క్రింద "మానస చంద్ర" అనే సంతకం ... తన పేరు వెనక నా పేరు జోడిస్తూ, ఎప్పుడూ నా ముందు ఇనీషియల్‌గా తనుండాలంటూ!

మానస అంటే, – "నీహారికా బిందు సందోహమ్ముల బరువును సైతం వోపలేక, నేలజారిన హిమస్నాత పుష్పం." – సున్నితమూ, సన్నిహితమూ, సహృదయమూ కలిగిన భార్య దొరకడం నిజంగా నా అదృష్టం.

బస్సు సడెన్ బ్రేక్ వేయడంతో మానస తాలూకు పరిమళం కాస్త దూరమై, ఇహ లోకంలోకొచ్చాను. డైరీ మూసి తేరుకుని చూసేసరికి ప్రయాణీకులం దరూ క్రిందికి దిగుతున్నారు. బస్‌లో లైట్ ఆరిపోయింది. కిటికీలోంచి తల బయటపెట్టి చూశాను. క్రింద చీకట్లో అందరూ డ్రైవర్ చుట్టూ మూగివు న్నారు. ప్రక్కనే నిలబడి వున్న ఓ వ్యక్తిని పిలిచి ఏమయిందని అడిగాను. "ఏవుంది? మామూలే. బస్సు ఇక కదలదు. ఫెయిలయిందట" చెప్పి ఇంకా ఏదో గొణుగుతూ జనంలో కలిసిపోయాడు. టైమ్ చూసుకున్నాను. రేడియం డయల్లో టైమ్ పదకొండూ నలభై సూచిస్తోంది. ఇంతరాత్రి ఈ అడవిదారిలో మరో కన్వేయన్స్ దొరికేవరకూ వేచి వుండాల్సిందేనేమో. లేదా బస్సు బాగయ్యేంతవరకూ వుండాలి. ఏం చేయడం? నేనూ సీట్లోంచి లేచి క్రిందకు దిగాను.

జనం ఆర్టీసీనీ, ప్రభుత్వాన్నీ తెగ విమర్శించేస్తున్నారు. గట్టిగా మాట్లాడితే డ్రైవర్‌నీ, కండక్టర్‌నీ పట్టుకుని చితకబాదేంత వీరావేశంతో కనిపిస్తున్నారు. పాపం వాళ్ళిద్దరూ బిక్కమొహం వేసుకుని రిపేర్ చేయడం మొదలుపె ట్టారు. నాకు కాస్త ప్రశాంతంగా కూర్చోవాలన్పించి చుట్టూ చూశాను. కాస్త దూరంలో రోడ్డు ప్రక్కన బండరాయి కన్పించింది. జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకుని అటుకేసి నడిచాను. వెన్నెల్లో జాగ్రత్తగా చూసుకుంటూ బండరాతిని సమీపించి, కర్చీఫ్‌తో దులుపుకుని కూర్చున్నాను. నిశ్శబ్దంలో కీచురాళ్ళ రొద నిశాకన్య ఆలపించే కూనిరాగంలా వుంది. ఈ వెన్నెల్నీ, ఈ ప్రశాంతతనీ చూస్తుంటే, మళ్ళీ మానస తాలూకు దివ్య పరిమళం మెల్లమెల్లగా చుట్టుముట్టడం ఆరంభించింది. ఇక్కడ, ఇప్పుడు హఠాత్తుగా మానస ప్రత్యక్షమైతే ఎంత బావుణ్ణు? వెంట రమ్మని అంటే తలనొప్పిగా వుందంటూ తప్పించుకుంది. వెళ్ళాక చెప్పాలి... తనెంత మంచి అనుభవాన్ని మిస్సయ్యిందో. అయినా తానెప్పుడూ అంతే. ఇలా ఆఫీస్ పనుల మీద ఊరు

వెళ్ళాల్సి వచ్చినప్పుడల్లా, పాపం, తను ఒంటరిగా ఒకర్తే ఇంట్లో వుండాల్సి వస్తుందని రమ్మంటే, "మీరేమో ప్రొద్దున వెళ్ళి ఎప్పుడో వస్తారు. అంతవ రకూ ఎదురుచూస్తూ కూర్చోవాలి. అదే పని ఇంటిదగ్గర చేస్తానులెండి. అయినా విరహం కూడా అప్పుడప్పుడూ మధురంగానే వుంటుంది" - అంటూ తప్పించుకుంటుంది.

నా ఆలోచనల్ని భగ్నం చేస్తూ చిరుమువ్వల సవ్వడి. తెప్పరిల్లి ఎదురుగా చూశాను. ఎవరో యువతి, నాకేసే వస్తోంది_ వెన్నెల వెలుగులో రెక్కలు చాచి ఎగిరివస్తున్న ఆశల విహంగలా_ గ్రీష్మంలోకి శరత్తుని తోడు తీసుకుని ఆమని వచ్చినట్టు.

సంభ్రమంగా చూస్తున్న నావేపు గుచ్చి గుచ్చి చూస్తూ "మీరు ... మీరు 'రమేష్‌చంద్ర' కదూ!" ఒక్క క్షణం నా కళ్ళల్లో విస్మయం. ఈ దారికాని దారిలో, ఊరుకాని వూళ్ళో ఒకమ్మాయి, అదీ నన్నెరిగిన అమ్మాయి... నా ఆశ్చర్యాన్ని పైకి కన్పించనీకుండా "మీరు...?" ప్రశ్నార్థకంగా ఆగిపోయాను. ఆమె నా ప్రశ్న గురించి పట్టించుకోకుండా "ముందిది చెప్పండి. మీరు రాఘవరావు గారబ్బాయి రమేష్‌చంద్ర గారేనా, కాదా?!" ఆ కంఠంలో ఏదో ఉద్వేగం. "అవును" అని నేననడంతోనే సుడిగాలిలా నా దగ్గరికి దూసుకువచ్చి నా చేతులు పట్టుకుని వూపేస్తూ "ఏయ్ మొద్దూ! నేను, శ్రావణిని. నీ చిన్ననాటి నేస్తాన్ని!" అంది. నాలో ఆశ్చర్యం రెట్టింపయ్యింది. ఎక్కడో మద్రాసులో చదువుకుంటోందని విన్నాను. ఇలా ... ఇక్కడ... నాకూడా ఈ అడవి దారిలో ... ఒక మంచి స్నేహితురాలు దొరికినందుకు ఉత్సాహం వేసింది.

"శ్రావణీ!" తరవాత ఏం మాట్లాడాలో తోచలేదు.

"అవునోయ్! శ్రావణినే. ఇందాక బస్సు దిగుతోంటే చూశాను. నీ ఫోటో మీ అమ్మగారు చూపించార్లే! అందుకే గుర్తుపట్టాను. కానీ నువ్వేనా కాదా? అనే ఓ చిన్న అనుమానం. నువ్వు కాకపోతే అనవసరంగా చొరవ దీసుకున్న దాన్నవుతానని.. ఇంతసేపూ ఆలోచించి - ఇక ఆగలేక వచ్చేశాను. అది సరే! నువ్వేమిటి... ఇక్కడ?"

"నా విషయం అటుంచు. ముందిలా కూర్చో! ఎక్కడో మద్రాస్‌లో చదువుతున్నావని విన్నాను?" అడిగాను.

"అవును. మద్రాస్ నుండి మన వూరొచ్చి వారం రోజులైంది. ఇక్కడ మా బాబాయ్‌గారింటికి వెళ్ళొస్తున్నాను" అంది.

"అలాగా ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. పూర్తిగా మారిపోయావ్. అసలు ఇంకా నిన్ను పోల్చుకోలేక పోతున్నాను కూడా!" "నేనూ నీ ఫోటో ఒక్కసారి మాత్రమే చూసుంటే గుర్తుపట్టకపోయేదాన్ని. మీ అమ్మగార్ని అడిగి వెంట తెచ్చుకుని కనీసం ఇప్పటికి ఏ వెయ్యిసార్లో చూసుంటా" చెప్పడం ఆపి నా ముఖంలోకి తదేకంగా చూస్తూ "నిజంగా నువ్వు చాలా అందంగా మారిపోయావు చంద్రం, అసలు ఆ చిన్నప్పటి నువ్వేనా అని, యింకా ..." ఆపైన చెప్పలేనట్టు - హఠాత్తుగా నా వొళ్ళో తలవాల్చేసి రెండు చేతుల్తో నన్ను గట్టిగా పట్టుకుంది. నా చేతుల్లో, నా అణువణువులో ఏదో కలవరం. రెండు క్షణాలు గడిచేసరికి, ఎవరో నానుంచి ఏదో బలవంతంగా లాక్కెళ్ళిపోతున్నట్టు, నా గుండెల మీద రాసుకున్న రాతల్ని ఎవరో చెరుపుతోన్నట్టు ... నా మనసు అల్లకల్లోలమయిపోయింది. విడిపించి శ్రావణిని కాస్త బలవంతంగానే వేరు

## బహుమతులు అందజేస్తున్నవారు


YOU JUST CAN'T DIGEST UNLESS YOU MIX 'N' GRIND



**Highlights**

- *450 Watts*
- *Motor - ISI standards*
- *Blades and jars of top grade stainless steel*
- *Double locking system*
- *Overload protection*
- *3 jars for different operations.*




PRASAD & RK

**MARKETED BY**

**KINETIC MARKETING ASSOCIATES**

**7-65, Adj. PETROL PUMP**

**HABSI GUDA, HYDERABAD- 500 007**

Phone No: 852997

**KINETIC**

KITCHEN MACHINE

చేశాను. క్రమక్రమంగా సుడిగాలి ఉధృతం తగ్గి, దుమ్ము చాటునున్న దారి స్పష్టమైనట్టు ... నాలో అలజడి తగ్గి, ఆ వెనక మానస రూపం కళ్ళముందు నిలిచింది. అదే చిరునవ్వు. అవే కళ్ళు – విశ్వజనీన ప్రేమను నింపుకొన్నట్టు.

హఠాత్తుగా బస్సు హారన్ మోగడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాను. ప్రక్కన శ్రావణి ... నా ముఖంలోకే చూస్తూ ...! ఆ చూపుల్ని తప్పించుకుంటూ లేచి నిలబడి "పద. బస్సు బాగయినట్టుంది" అన్నాను. శ్రావణి లేస్తూ నాకో చెయ్యి అందించింది. అందుకోక తప్పలేదు.

బస్సు ఎక్కి నా సీట్లో కూర్చున్నాను. శ్రావణి నా పక్కనున్న వ్యక్తిని రిక్వెస్ట్ చేసి తన సీటిచ్చి, నా పక్కనొచ్చి కూర్చుంది. బస్సు బయలుదేరేవరకూ ఇద్దరమూ ఏమీ మాట్లాడుకోలేదు. కాస్త దూరం వెళ్ళాక లైట్లు ఆరిపోయాయి. వెంటనే శ్రావణి నాకు దగ్గరగా జరుగుతూ "అబ్బ. చలేస్తోంది" అంది.

చలేమిటి? చల్లటిగాలి హాయిగా అనిపిస్తోంటే. నాకేం అర్థం కాలేదు. "షట్టర్ మూయనా?" మూయటం ఇష్టం లేకపోయినా అడిగాను. "ఊఁ" అంది. షట్టర్ మూసేసి, కాస్త శ్రావణికి తగలకుండా కూర్చున్నాను.

"పెళ్ళి చేసుకున్నావటగా?" చీకట్లో నా తొడమీద చేయివేసి అడిగింది శ్రావణి.

"అవును. నువ్వు...?" యథాలాపంగా తగిలించినట్టు ఆమె చేతిని పక్కకు జరుపుతూ అడిగాను.

"ఉహూ... నీలాంటి అందగాడు దొరికాక చేసుకుంటాను." ఆమె సమాధానం నాకు అసంగతంగా తోచింది.

మళ్ళీ శ్రావణే అడిగింది. "మీ ఆవిడ బాగుంటుందా?"

"ఊఁ"

"నాకన్నానా?"

"బావుంటుంది. అంతే. పోలికెందుకు?" ఈ సంభాషణ ఎందుకో నాకు చికాకు కలిగించింది. కానీ, చిన్నప్పటి స్నేహితురాలు. దాదాపు పదిహేనేళ్ళ తరవాత కలుసుకోవడం. అందుకే నిగ్రహం పాటించాను.

కాసేపయ్యాక శ్రావణి సంభాషణ కొనసాగించింది. "మీ అమ్మగారు నువ్వీ మధ్య రావని చెప్పారే?" అని.

"అవును. ఇప్పుడు కూడా మన వూళ్ళో దిగడం లేదు. చీరాలలో పని చూసుకుని రేపు సాయంత్రానికల్లా తిరిగి వెళ్ళిపోవాలి. మళ్ళీ ఎల్లుండి డ్యూటీలో జాయిన్ అవాల్సుంటుంది" చెప్పాను.

శ్రావణి గొంతు గారాబంగా మార్చి "అదేంటమ్మా, ఇంకా నువ్వు మనూరొస్తున్నావు. ఎంచక్కా చిన్నప్పటి కబుర్లు చెప్పకోవచ్చు వనుకున్నాను".

నేనేమీ సమాధానం చెప్పలేదు.

తనే మళ్ళీ రెట్టిస్తూ నా చేయి పట్టుకుని "రాకూడదూ!" అంది.

"కుదరదు శ్రావణీ" మృదువుగా చేయి విడిపించుకుని చెప్పాను.

ఎందుకో చిన్ననాటి నేస్తం కలిసిందన్న ఆనందం నాలో హరించుకుపోతోంది. శ్రావణితో చనువుగా ఎందుకు మాట్లాడలేక పోతున్నానో అర్థం కావడంలేదు. కాసేపు చిన్నప్పటి విషయాలు మాట్లాడి శ్రావణి సీట్లో వెనక్కి జారి నిద్రపోయింది.

షట్టర్ తెరిచి వెన్నెల వెలుగులో ప్రకృతిని చూస్తూండిపోయాను. కాసేపటికి నాకు కళ్ళు మూతలు పడసాగాయి. సరిగ్గా అప్పుడు ... శ్రావణి తల నా భుజంపై ఆనింది. తల తిప్పి ఆమెకేసి చూశాను. కిటికీలోంచి పడే చంద్రకిరణం ఒకటి శ్రావణి ముక్కుపుడకపై పడి పరావర్తనం చెందుతోంది. బస్సు కుదుపులకి అప్పుడప్పుడూ ఆమె పెదవులు నా భుజాన్ని స్పృశిస్తున్నాయి. నాలో తిరిగి అలజడి. ఈసారి ఆ అలజడితో పాటు ఏ మూలనుంచో మలయమారుతం ఒకటి నన్ను స్పృశిస్తున్న భావన. కానీ, మాటిమాటికీ నా కళ్ళలో మానసే మెదుల్తోంది. అలా మానస మస్సులో మెదిలినప్పడల్లా నా భుజంపైనున్న శ్రావణి తల బరువుగా అనిపిస్తోంది. ఆఖరికి శ్రావణి తలను పక్కకు జరపాలని నిశ్చయించుకుని చేయి లేపే లోపలే శ్రావణి కుడిచెయ్యి పైకి లేచింది. ఏం జరిగిందో అర్థమయ్యేలోపునే ఆ చెయ్యి నా భుజాన్ని గుచ్చి పట్టుకుంది. ఈ సంఘటన కాకతాళీయంగా జరిగిందో, లేక కావాలని జరిగిందో గానీ – ఆమె తలను జరపాలని లేచిన నా చేయి నీరసంగా క్రిందికి వాలిపోయింది.

ఎక్కడినుండో పురుషత్వానికి మేలుకొలుపు. సన్నజాజుల పరిమళం మత్తుగా నాసికా పుటాలకు సోకుతోంటే, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బరువెక్కాయి. శ్రావణి కుడిచెయ్యి నా భుజంపైనుండి జారి బటన్ తీసి వున్న నా షర్ట్‌ని తొలగించి ఛాతీమీదకు చేరింది. మెల్లమెల్లగా అరచేత్తో నా ఛాతీమీది వెంట్రుకల్ని నిమరసాగింది. తల తిప్పి శ్రావణి వేపు చూశాను. కళ్ళు మూసుకునే వుంది. శ్రావణి మరో బటన్‌ని తొలగించింది.


10% డిస్కౌంట్



కైనెటిక్ ఎయిర్ కూలర్

కైనెటిక్ ఎయిర్ కూలర్లు, వాషింగ్ మెషిన్లు, కిచెన్ మెషీన్ల కొనుగోలుపై 10 శాతం తగ్గింపు పొందండి !

పాఠకుని పేరు :..............................

పూర్తి చిరునామా :..............................

..............................

మీ దగ్గరలోని కైనెటిక్ డీలర్‌కి ఈ కూపన్ అందజేయండి



కైనెటిక్ వాషింగ్ మెషీన్

ప్రత్యేక సూచన : ఈ కూపన్ వినియోగించుకున్న ప్రతి 25 మందిలో ఒకరికి లక్కీడిప్ ద్వారా కైనెటిక్ కంపెనీ నుండి సర్‌ప్రైజ్ గిఫ్ట్ అందజేయబడుతుంది. కనుక మీ పూర్తి చిరునామా మరువవద్దు.

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక

ఆ చెయ్యి కాస్త క్రిందకు జారి పొట్టపై నిలిచింది. అసంకల్పితంగా నా ఎడం చేత్తో ఆ చేతిని గట్టిగా పట్టుకున్నాను. ఇప్పుడు నాలో ఏ సంకోచమూ, బిడియమూ లేదు. ఒక చేతిని శ్రావణి భుజం చుట్టూ వేసి మరింత దగ్గరగా పొదివి పట్టుకున్నాను.

నా పెదవుల్తో సున్నితంగా శ్రావణి నుదుటిని అద్దాను. "నాతిచరామి" అని ఉచ్చరించిన ఆ పెదవులు కాస్త వణికాయి. మానస చిటికెన వేలిని పట్టుకున్న నా చేయి శ్రావణి శరీరాన్ని ఎక్కడెక్కడో తడమసాగింది. మానస అడుగుల్తో జతకలిపి సప్తపది నడిచిన నా పాదం శ్రావణి చీర కుచ్చిళ్ళని తప్పించి, ఆమె కాలిని సుతారంగా రాయబోయింది. కాని ఆమె నా చేతిని పట్టుకుంది. "6, ౭ అంకానికి మూడు రోజుల వ్యవధి..." నా చెవి దగ్గర గొణిగింది. నాకు విషయం బోధపడింది.

శ్రావణి పెదవుల్ని నా పెదవులకందించింది. రెండు నిమిషాలు అమృతధార వర్షించింది. అనువుగాని ప్రదేశం. అయినా అంతులేని కోర్కె. వేడి చల్లారాలనే తాపత్రయం. కానీ అనుగుణంగా లేని పరిస్థితి.

సడన్‌గా లైట్లు వెలగడంతో శ్రావణి చప్పున నన్నొదిలేసి సర్దుకు కూర్చుంది. కిటికీలోంచి చూశాను. 'గంజాం' వచ్చేసింది. శ్రావణి అప్పటికే బ్రీఫ్‌కేస్ తీసుకుని లేచి నిలబడింది. నేను పుట్టి పెరిగిన వూరు. కాలక్రమంలో ఎన్నో వసంతాలు గడిచినా పునస్సమాగమం మాత్రం మా ఇద్దరికీ ఇక్కడే జరిగింది... చిత్రంగా.

తలెత్తి శ్రావణి కళ్ళలోకి చూశాను. ఆ కళ్ళు శ్రావణ మేఘాలే అయ్యాయి. "మరో పది రోజులుంది మద్రాస్ వెళ్ళిపోతాను. ఈలోపులో ఇక్కడికి తప్పక రావాలి" నా పెళ్ళి సెటిలయింది. మనసులో ప్రతిష్ఠించుకున్న మనిషికి తొలుతగా నన్ను నేను అర్పించుకోవాలనుకుంటున్నాను. శ్రావణి మాటలకు అవుననో, కాదనో తెలీకుండానే నా తల కదిలింది. తను మౌనంగా పెట్టె పుచ్చుకుని క్రిందకు దిగింది. మరుక్షణం కండక్టర్ డోర్ మూయటం, బస్ కదలటం జరిగిపోయింది. నిట్టూర్చి సీట్లో వెనక్కి జారాను. ఇందాక జరిగిన సంఘటన పదే పదే గుర్తుకు వస్తోంది. ఓ ప్రక్కనుంచి మానస పంచే ప్రేమ, కల్మషం లేని ఆమె అభిమానం...నేనేం చేశాను? క్షణికోద్రేకంలో మనసా వాచా ప్రేమించిన అర్ధాంగికి ద్రోహం తలపెట్టి మరో స్త్రీతో ... చనువు ముందుగా శ్రావణి నుంచే ప్రారంభమవనీగాక. నేను మాత్రం పూర్తిగా ఇన్‌వాల్వ్ అవలేదూ?! నాలో రంపపుకోత క్షణక్షణమూ పెరిగిపోతోంది. కాని మనసు శ్రావణి వైపు మొగ్గు చూపుతోంది. ఆ అనుభవం కోసం తహతహలాడుతోంది. ఎలాగయినా, ఏమయినా సరే శ్రావణి మద్రాసు వెళ్ళే లోపు నాలో కలుపుకోవాలి – అన్న నిర్ణయానికి వచ్చాను. నా చిన్ననాటి స్నేహితురాలితో పంచుకోబోయే మధురస్మృతులు పంచరంగుల్లో కనిపించడం ప్రారంభించాయి. నరాలలో ఉద్రిక్తత పెరిగింది.

బస్సు దిగేసరికి రాత్రి పదకొండు గంటలయింది. బస్టాండుకు ఇల్లు దగ్గరే అవడంతో నడవడం మొదలుపెట్టాను. బస్టాండు ప్రక్కనే వున్న పూల దుకాణం అప్పుడే కట్టేస్తున్నారు. అక్కడ ఆగి పది రూపాయల నోటిచ్చి మల్లెపూల పొట్లాం కట్టించుకున్నాను. వీధి మలుపు తిరిగి కాస్త దూరంగా కన్పిస్తున్న ఇంటికేసి చూడగానే నా గుండె వేగంగా స్పందించడం మొదలుపెట్టింది. ఆ ఇంట్లో మానస వుంటుందనీ, ఎక్కడికీ పోదనీ తెలిసినా నా పాదాలు వడివడిగా పడసాగాయి.

గేట్ తీసుకుని వరండాలో చెప్పులు విడిచి, గుమ్మంలోకి అడుగు పెట్టబోయాను. అక్కడ గుమ్మం ముందు తెల్లని గులాబీరేకలపై ఎర్రని గులాబీలతో "స్వాగతం" అని అందంగా అమర్చి వుంది. నేను ఉదయాన్నే వచ్చేసరికి అమర్చడం ఆలస్యమవుతుందని, ఇప్పుడే అమర్చి వుంటుంది. ఒక్క క్షణం నా కళ్ళు చెమర్చాయి. 'ప్రేమమయీ! జీవితపు రహదారిలో ఏ మైలురాయి దగ్గర నువ్వు నా రథాన్ని ఎక్కావో గుర్తులేదు గానీ, దేవుడికి చెప్పి, నా జీవితాన్ని ఇంకా పొడిగించుకోవాలని వుంది... మరే మైలు రాయీ తారస పడకుండా...!'

ఆ భావావేశం నుండి తేరుకుని, పూలను తొక్కకుండా అడుగు వేయబోయేసరికి – లోపలినుండి నవ్వులు విన్పించాయి. అప్రయత్నంగా నా కాలు గాల్లోనే ఆగిపోయింది.

"ఏయ్ ...! మీ ఆయన గనక వస్తే, మననిలా చూసి ఏం చేస్తాడంటావ్?"

అది ... అది శ్రీకాంత్ కంఠం. నా ఆలోచన పూర్తికాకముందే మానస కంఠం. "ఏడిశాడు! రేపుదయం తగలడ్తానన్నాడు. రానీ, వస్తే ఏంటంట? భయమేసింది... తోడుంటానికి రమ్మని నేనే ఫోన్ చేశానంటాను. నమ్మితే నమ్మాడు. లేకపోతే ఉరేసుకు చస్తాడు" – నన్ను చిన్నపిల్లాణ్ణి చేసి గోరుముద్దలు తినిపించిన మానస... వూరెళ్ళొస్తే దిగులు పెట్టుకునే మానస... అసలు నేనొచ్చింది నా ఇంటికేనా?!

"అబ్బో! ఎంత ధైర్యం! పెళ్ళి కాకముందు ఈ ధైర్యమే వుంటే, ఈపాటికి మనకు నలుగురు పిల్లలు పుట్టేవాళ్ళు." మళ్ళీ నవ్వులు. నాలో అగ్ని పర్వతాలు బ్రద్దలు కావడంలేదు. నా కాళ్ళ కింద భూమీ కంపించడం లేదు. మిన్నూ, మన్నూ ఏకం కాలేదు. అంతా ఎప్పటిలాగే వుంది. ప్రశాంతంగా! ఎటొచ్చీ, నాలో ఇంకా ప్రాణం వుందో లేదో అర్థం కాలేదు.

తిరిగి శ్రీకాంత్ కంఠం విన్పించింది. "మరి ఎదురుగా వుంటే ప్రపంచంలోని ప్రేమంతా గుప్పిస్తావ్!"

'ఏయ్ మొద్దూ! అలా నటించకపోతే, నువ్వూ నేనూ కలుసుకోవటం ఎలా కుదురుతుంది?" మానస అనగానే, "అమ్మ దొంగా..." ఆ తర్వాత శ్రీకాంత్ కంఠమూ, మానస కంఠమూ విన్పించలేదు. నా కళ్ళ వెంట అశ్రుధార.

'చెలీ! దోసిలి పట్టు– నా కన్నీరు నిండేంతవరకూ! కారిపోనీకు ఏ వేళ్ళ సందుల్లోంచో ... నీ హృదయం జల్లెడలోంచి నా ప్రేమామృతం జారిపోయినట్టు! నా కన్నీరు నీ దాహాన్ని తీరిస్తే, నీదగా సముద్రమై నన్ను ముంచేస్తుంది."

నా కళ్ళు క్రిందికి తిరిగాయి. తెల్లని మనసు రేకలపై ఎర్రని రక్తాన్ని చిందిస్తున్నట్టు – సాక్ష్యంగా గులాబీలు స్వాగతమంటూ వికృతంగా తోచాయి. మరుక్షణం నా పాదం వాటి మీద పడింది. అంతే! అందమైన గులాబీ వెనక దాగిన వాడి ముల్లు కసిగా నా పాదాన్ని చీల్చింది...

"ప్రేమంటే, నమ్మకమనే రంగు పూసిన పేక మేడేనా!"

